

భారాల విద్యుత్ స్మార్ట్ మీటర్లు వద్దు..

- క్యూఆర్ కోడ్ క్లిక్ చేసి వ్యతిరేకత తెలపాలి
- సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు


క్యూఆర్‌కోడ్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఆదానీ, అంబానీ సెకీ ఒప్పందాన్ని రద్దుచేసి కరెంటు స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, ట్రూఅప్ ఛార్జీలను వ్యతిరేకించాలని, ప్రభుత్వానికి అర్జీలు ఇవ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకత తెలపాలని రూపొందించిన కరపత్రాలను శుక్రవారం సిపిఎం కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు ప్రస్తుత ముఖ్యమంత్రితో సహా మంత్రులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించి నిరసన వ్యక్తం చేసిన పరిస్థితి వుందని, వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాన్ని వేయడం దారుణమని 'భారాలే భారాలు' అని నిరసన చేసిన వాళ్ళు అధికారంలోకి వచ్చిన వెంటనే అదే ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రజలపై భారీ స్థాయిలో విద్యుత్ భారాలు మోపుతుండడం సిగ్గుచేటు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచినప్పుడు సమరశీల పోరాటాలు చేసి ముగ్గురు ప్రాణాలను త్యాగం చేసిన సంగతిని గుర్తు చేశారు. ప్రజలకు అండగా పోరాటాలు చేస్తున్న ఏకైక పార్టీ సిపిఎం అన్నారు. కరెంటు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, సెకి ఒప్పందని రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక రకాల పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రభుత్వానికి అర్జీలు పెట్టాలని సిపిఎం పిలుపు నిస్తోందన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సిపిఎం ఇంటింటికి ఇస్తున్న కరపత్రంలో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకత అర్జీ పెట్టాలని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం ఫోన్లు ఎలా రీఛార్జ్ చేస్తున్నామో డబ్బులు అయిపోతే ఫోన్ ఎలా కట్ అయిపోతుందో అదే పద్ధతిలో స్మార్ట్ మీటర్లు పెట్టిన తర్వాత ఫోన్ లో రీఛార్జ్ చేసిన విధంగా కరెంటు బిల్లు కట్టాలని, ఫోన్లో బ్యాలెన్స్ లేకపోతే కరెంట్ కట్ చేస్తారు. ఇలాంటి దారుణమైన పరిస్థితిని ప్రజలు తీసుకొస్తుండడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక రకం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక రకంగా వ్యవహరించడం దారుణమన్నారు. ప్రజలపై ట్రూ ఆప్ ఛార్జీలను భారం తగ్గించి విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో మరో విద్యుత్ పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జ్యోతిరావు అయ్యప్ప , గంగాధర్ పాల్గొన్నారు.

జిల్లాలో 65,451 'బంగారు కుటుంబాలు' గుర్తింపు

- 15 లోపు లక్ష్యం చేరుకోవాలి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశం



ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేలతో నిర్వహించిన ఈ ఉన్నతస్థాయి సమీక్షలో, పీ4 పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు చిత్తూరు జిల్లా నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్రపాడేల్, పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సీఎం నేరుగా కార్యక్రమ పురోగతిపై ఆరా తీశారు. జిల్లాలో 65,451'బంగారు కుటుంబాలు' గుర్తించామని కలెక్టర్ సుమిత్ కుమార్ వెల్లడించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లాలో చేపడుతున్న చర్యలను వివరించారు. జిల్లాలో మొత్తం 65,451 బంగారు కుటుంబాలు గుర్తించామని వీటిలో కుటుంబాలను దత్తత తీసుకున్నారని, ఇంకా కుటుంబాలు దత్తత కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీలోపు 1,93,424 కుటుంబాల దత్తత లక్ష్యాన్ని సాధించేందుకు చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా చిత్తూరు -7,953, గంగాధర నెల్లూరు (ఎస్‌సి)-11,573, కుప్పం -10,407, నగరి-5135, పలమనేరు -10,106, పుంగనూరు -9,541, పూతలపట్టు -10,736 కుటుంబాలు మొత్తం : 65,451 కుటుంబాలు ఉన్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ చొరవ తీసుకుని, ముఖ్యమంత్రి నిర్దేశించిన లక్ష్య సాధన కోసం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 15 నాటికి 1,93,424 కుటుంబాలను దత్తత తీసుకోవడం జిల్లాలో ప్రస్తుత ప్రాధాన్యతగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసులు, జిల్లా ప్రణాళిక అధికారి కార్యాలయపు ఏడీ బి.సాంబశివా రెడ్డి పాల్గొన్నారు.

మామిడి ధర గోప్యం!

- ఎంత చెల్లిస్తారో తెలియని పరిస్థితి
- ప్రభుత్వ నిబంధనలు పాటించని ఫ్యాక్టరీ యాజమాన్యం
- అంగీకార పత్రంపై ధర చెప్పకనే సంతకాలు
- ఇంకా కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- ఆందోళనలో రైతులు


జిడి నెల్లూరు మండలంలోని జైన్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీ

ప్రజాశక్తి - వెదురుకుప్పం: జిడి నెల్లూరు నియోజక వర్గంలో మామిడి రైతుల పరిస్థితి ప్రశ్నార్ధకంగా మారింది. ప్రైవేటు జ్యూస్ ఫ్యాక్టరీల యాజమాన్యం స్వయం ప్రభుత్వం నిర్ణయించిన కేజీ ధర 8 రూపాయలు కాకుండా ఎంత ధరకు కొనుగోలు చేస్తోందో తెలియక గోప్యంగా వుంచుతోంది. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందు తున్నారు. మరో వైపు ఫ్యాక్టరీల యాజమాన్యం కొనుగోలు పత్రంపై ధర నిర్ధారించకుండా రైతుల వద్ద సంతకాలు తీసుకుంటోంది. రోజుల తరబడి కిలోమీటర్ల మేర ఫ్యాక్టరీ వద్ద నిరీక్షించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఏమాత్రం పట్టించుకోక పోవడంతో మామిడి రైతులు ఆందోళనలో పడ్డారు.

మామిడి ధర గోప్యం!

జిడి నెల్లూరు నియోజకవర్గ పరిధిలో జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ పరిధిలో రోజూ మామిడి రైతులు రోజుల తరబడి తాము తీసుకొచ్చిన వాహనాలతో రెండు, మూడు కిలోమీటర్ల మేర నిరీక్షిస్తున్నారు. అయినా ప్రభుత్వం ప్రకటించిన కేజీ ధర 8 రూపాయలకు కొనుగోలు చేయడంలేదని రైతులు వాపోతున్నారు. అసలు మామిడి గుజ్జు పరిశ్రమ యాజమాన్యం ఏ ధరకు కొనుగోలు చేస్తోందో, ఏ ధర చెల్లిస్తుందో కూడా తెలియని అయోమయ స్థితిలో తమ వద్ద అంగీకార పత్రంపై సంతకాలు చేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. మరో వైపు ప్రభుత్వం చెల్లిస్తామన్న సబ్సిడీ ధర కూడా వస్తుందో రాదో తెలియడం లేదని రైతులు సందేహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిబంధనలు గాలికి

రెండు వారాల క్రితం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మేరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేయాలని పేర్కొంది. ఈ మేరకు పర్యవేక్షణ బాధ్యత చేపట్టిన కలెక్టర్ ఫ్యాక్టరీ యాజమాన్యాలతో పలు దఫాలు చర్చించారు. ఆ తర్వాత వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సైతం చిత్తూరు వచ్చి గుజ్జు ఫ్యాక్టరీని పరిశీలించి రైతులకు భరోసా ఇచ్చారు. అయినా గుజ్జు పరిశ్రమలు ప్రభుత్వ మద్దతు ధర కేజీ కి రూ.8 చెల్లించడం లేదు. అసలు ఏ ధర చెల్లిస్తాయో కూడా తెలియని స్థితిలో కొనుగోలు చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అధికారులు ఎవరూ మామిడి రైతులను పట్టించుకోవడం లేదని తెలిపారు.

కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు

ఇప్పటికే రైతులు ఫ్యాక్టరీ వద్ద రెండు, మూడు రోజుల తరబడి తిండి, నిద్ర లేక దయనీయ స్థితిలో నిరీక్షించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. తాము లక్షలు ఖర్చుపెట్టి వాహనాల్లో తీసుకొచ్చిన మామిడి పండ్లు ఫ్యాక్టరీ యాజమాన్యం కొనుగోలు చేసే సమయానికి చాలా కుళ్లిపోయి పడవేయాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. చివరకు పంట ఖర్చులు, రవాణా ఖర్చులు పోను చేతికి వచ్చేదేమీ లేదని నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొం టున్నారు.

న్యాయం చేయండి..



మాకు న్యాయం చేయండి.. పంటను కొనడం లేదు.. దిక్కులేక పడిగాపులు కాస్తున్నాం.. ప్రభుత్వం వెంట నే స్పందించాలి.

- వరమేశ్వరయ్య, బలజల గుంట గ్రామం, మాంబేడు పంచాయతీ, వెదురుకుప్పం మండలం.

రైతులతో చెలగాటం



జిల్లాలో మామిడి గుజ్జు పరిశ్రమలు మామిడి రైతుల జీవితాలతో చెలగాటమాడు తున్నాయి. రోజుల తరబడి ఫ్యాక్టరీల వద్ద పడిగాపులు కాస్తున్నా టోకెన్లు ఇవ్వడం లేదని బోర్డులు పెట్టడం ఏమిటి? పక్వానికి వచ్చిన కాయలనే దింపాలని అధికారులు చెబుతున్నప్పటికీ ఫ్యాక్టరీ వద్ద తోటలో రాలిపోతున్నా పరిశ్రమ యాజమాన్యాలు కట్టింగ్ అవకాశం ఇవ్వడం లేదు. రైతులు దిక్కుతోచక అయోమయంలో వున్నారు. రోజుల తరబడి ట్రాక్టర్ లోనే కాయలు ఉండడంతో కుళ్లిపోయి తీవ్ర నష్టం వస్తోంది. మామిడి గుజ్జు యాజమాన్యాలు ఉద్దేశపూర్వకంగానే రైతులు దగ్గర సరుకు తీసుకోవడం లేదు. రెండు రూపాయలు మూడు రూపాయలు అంటూ అది కూడా ఇవ్వలేమో మాకు అవసరం లేదని చెప్పడం దుర్మార్గం. వెంటనే ప్రభుత్వం, అధికారు లు స్పందించాలి..

- వాడ గంగరాజు, (సిపిఎం) ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

రైతుల ఆగ్రహం చవిచూడొద్దు..



ఫ్యాక్టరీల వద్ద రోజుల తరబడి రైతులు తమ వాహనాలతో నిరీక్షించి విసిగి పోతున్నారు. ఈ ప్రభుత్వం చెప్పేవన్నీ ఫ్యాక్టరీ యాజమాన్యం పట్టించుకోవడం లేదు. రైతుల గోడు ప్రభుత్వం వినడం లేదు.. వచ్చే ఎన్నికల్లో రైతుల తమ ప్రతాపం చూపిస్తారు. ఆ పరిస్థితి తెచ్చుకోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నాం..

- కామసాని వెంకట్ రెడ్డి, జిల్లా రైతు నాయకులు, జిడి నెల్లూరు మండలం.


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

అల్లూరి సీతారామరాజు కృషి మరువలేనిది: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : గిరిజనుల అభివృద్ధికి మన్యం అల్లూరి సీతారామరాజు చేసిన కృషి మారువలేనిదని కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని పాత గ్రీవెన్స్ హాలులో అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డిఆర్ఓ కె మోహన్ కుమార్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్ననాటి నుంచే దానగుణం, నాయకత్వ లక్షణాలతో విలక్షణమైన వ్యక్తిత్వాన్ని కలిగి స్వాతంత్ర్య సమరయోధుడిగా అవతరించారని తెలిపారు. గిరిజన తెగ కాని వీరుడు మన్యం ప్రాంత గిరిజనుల కష్టాలు, సమస్యలను చూసి చలించి బ్రిటీష్ వారితో పోరాడి మన్యం ప్రాంత ప్రజల గుండెల్లో ధైర్య సాహసాలను నింపారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ వారితో పోరాడి అతి చిన్న వయసులోనే వీర మరణం పొందారన్నారు. అల్లూరి సీతారామ రాజు సేవలు మరువలేనివన్నారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో తాను జన్మించడం తన అదృష్టంగా భావిస్తున్నానని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ధైర్యంగా సమస్యలు ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ శ్రీనివాసరావు, జిల్లా బిసి సంక్షేమ అధికారి రాబబాణీ బాష, ఏఓ వాసుదేవన్ పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: సీతారామరాజు చిత్ర పటానికి ఎస్పి మణికంఠచందోలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీతారామరాజులో వున్న నిజాయితీ, ధైర్యం, దేశభక్తి మన ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని, పోలీసు వ్యవస్థలో ప్రతి ఒక్కరూ అల్లూరి సేవా తత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు.

చిత్తూరు అర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తుమ్మింద పాల్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు కే. సంజీవి అల్లూరి సీతారామరాజు సేవలను వివరించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న మోనీష్ బృందం అల్లూరి సీతారామరాజు నాటికను ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయిని వసంత లక్ష్మి విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు హెచ్ అరుణ శివప్రసాద్ ,తెలుగు ఉపాధ్యాయులు జయమని, శంకర్ నాయక్ ,అమర్నాథ్ ,లలిత , కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పోలీసు కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్‌పి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్: పోలీసు మృతుల కుటుంబాలను ఆదుకుంటామని ఎస్‌పి విఎన్ మణికంఠ చందోలు అన్నారు. పోలీసు మృతుల కుటుంబాలకు జిల్లా పోలీస్ కార్యాలయ బి-సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం , క్లర్క్ శ పార్థసారధి నాయుడు సమక్షంలో ఎస్‌పి శుక్రవారం చెక్కులు అందించారు. ఎస్ఆర్‌పురం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ అనారోగ్య కారణంగా మరణించిన పిసి 4713 పి.ఆనంద్ బాబు సతీమణి మాధవికి, గుడుపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గత తేడాది ఏప్రిల్ 23వ తేదీ అనారోగ్యంతో మృతి చెందిన పిసి 3395 లక్ష్మి భర్త హరీష్‌కు కార్పస్ ఫండ్ నుండి శుక్రవారం ఒక్కొక్కరికి రూ.లక్ష రూపాయలు చొప్పున మొత్తం 2 లక్షల రూపాయల చెక్కులను ఎస్‌పి అందించారు. ఈ సందర్భంగా చనిపోయిన వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి, పోలీస్ శాఖ తరపున వారికి అన్ని విధాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

వరుస ఏనుగుల దాడులు

పొలాల వైపు వెళ్లేందుకు భయపడుతున్న రైతులు

ప్రజాశక్తి - రొంపిచర్ల: పులిచెర్ల మండలం పాతపేట, బోడి రెడ్డి గారి పల్లి పంచాయతీలలో శుక్రవారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు వ్యవసాయ పంటలపై దాడులకు పాల్పడింది. ఈ దాడిలో రైతులు ముని రాజా, సురేష్, చంద్రశేఖర్, నారాయణ, నటరాజ, నందగోపాల్ లకు చెందిన మామిడి చెట్లు కొమ్మలను విరిచి, కాయలు నేలరాల్చి ధ్వంసం చేశాయి. కొబ్బరి చెట్లు, అరటి చెట్లు తొక్కి నాశనం చేశాయి. రైతులకు అపార నష్టం వాటిల్లింది. ఏనుగులు పగలంతా అడవుల్లో తిష్ఠవేసి అర్ధరాత్రి దాటిన తర్వాత గ్రామాలలోకి ప్రవేశించిన సందర్భాలు చాలా ఉన్నాయి. గ్రామాల్లోని ఇళ్ల మధ్యలో నుంచే పంట పొలాల పైకి వెళ్లి విధ్వంసం సృష్టిస్తు న్నాయి. ఈ ఏనుగులకు భయపడి రైతులు పంట పొలాల వైపు వెళ్లాలంటే ఆందోళన చెందు తున్నారు. దాడి జరిగినప్పుడు అటవీ శాఖ అధికారులు ఘటన స్థలాలను పరిశీలించడం, నష్ట పోయిన రైతులను పరామర్శించడం తప్ప రైతులకు నష్ట పరిహారం చెల్లిం చడం లేదు. ఇప్పటివరకు పలుమార్లు ఈ దాడులు జరుగుతున్నా పూర్తి పరిష్కార మార్గం చూడలేకపోతున్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.


మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



ప్రజాశక్తి - సోమల: సోమల మండలం నెల్లిమంద పంచాయతీ చింతల వారి పల్లి గ్రామంలో 2020, జులై 20వ తేదీ పది ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన రామకృష్ణ (46) అత్యాచారం చేసి పారిపోగా తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి ఎన్ శంకర్రావు నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధించారు. చింతల వారి పల్లెకు చెందిన బాలిక ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా అదే గ్రామానికి చెందిన రామకృష్ణ మద్యం తాగి ఇంటి పక్కనే ఉన్న శిథిలమైన ఇంటిలోకి తీసుకువెళ్లాడు. బాలిక ప్రతిఘటించగా ఎవరికైనా చెపితే చంపేస్తానని భయపెట్టి లైంగిక దాడి చేశాడు. 21వ తేదీ బాలిక అక్క ఆమె తల్లికి విషయం తెలపడంతో తల్లి బాలికను పరిశీలించి సోమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ లక్ష్మీకాంత్ పలు సెక్షన్లలో కేసు నమోదు చేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడిని 2020 జులై 24వ తేదీ సూరయ్య గారి పల్లి బస్ స్టాప్ వద్ద అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. కేసు దర్యాప్తులో శుక్రవారం జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి శంకర్రావు కేసు వివరాలను పూర్తిగా పరిశీలించి బాలికపై లైంగిక దారికి పాల్పడ్డ నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఐదువేల రూపాయల జరిమానా విధించారని ఎస్ఐ శివశంకర్ తెలిపారు.

ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్లు కలకలం

-పోలీసుల అదుపులో సూత్రధారి

ప్రజాశక్తి -కార్వేటినగరం: ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్ల కలకలం రేపిన వ్యవహారం శుక్రవారం బహిర్గతమైంది. సీఐ హనుమంతప్ప కథనం మేరకు..మండలంలోని చింతమండి వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీలో గత కొన్నాళ్లుగా నకిలీ టోకెన్లతో కొందరు రైతులు మామిడికాయలు రవాణా చేస్తున్నట్లు గుర్తించిన ఫ్యాక్టరీ యాజమాన్యం శుక్రవారం ఫిర్యాదు చేయడంతో అక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని విచారించగా సబ్సిడీ నగదు జమ చేయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన హార్టికల్ సిబ్బంది వెంకటేష్ గత కొన్నాళ్ల క్రితం టోకన్లను ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో ముద్రించడమే కాకుండా కంపెనీకి చెందిన రబ్బర్ స్టాంపును కూడా తయారు చేయించి రైతులకు రూ.వెయ్యి నుంచి రెండు వేల వరకు అమ్మకాలు చేసినట్లు తెలిసిందన్నారు. దీంతో అతనిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. అతని వెనుక ఎంత మంది ఉన్నారనే కోణంలో విచారణ చేపడుతున్నామని, అతనికి సహకరించిన వారిపై కూడా చర్యలు తీసు కుంటా మన్నారు. ఇప్పటికే 34 టోకెన్లు జారీ చేశారని అందులో 19 లోడ్లు ఉండగా మిగిలిన లోడ్లు అన్‌లోడ్ అయినట్లు సీఐ పేర్కొన్నారు.

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం: యుటిఎఫ్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఐరాల మండల సర్వసభ్య సమావేశం పిలుపు నిచ్చింది. శుక్రవారం నిర్వహించిన మండల యూత్ సమావేశం మండల జిల్లా అధ్యక్షులు దేవరాజులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు గ్రామాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలి అన్నారు. ప్రభుత్వ విద్యా రంగ బలోపేతంలో యుటిఎఫ్ ఉపాధ్యాయులు కీలకంగా ఉండాలని కోరారు. యుటిఎప్ జిల్లా కార్యదర్శి ఏకాంబర నాయుడు మాట్లాడుతూ పెండింగ్ ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించి పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. మండల కార్యదర్శి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై పోరాట స్ఫూర్తితో పోరాడుతున్న యుటిఎఫ్ నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయులు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌లో చేరాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభాకర్ లీలావతి, సుధాకర్, సుగుణసుందరి, జనార్ధన్ లతోపాటు పలువురు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కంపు..కంపు ఎంతకాలం?

- శుభ్రం సరే..మార్చేదెప్పుడు?
- దుస్థితిలో డంపింగ్ యార్డు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 'డపింగ్‌యార్డు..డంపింగ్ యార్డు కంపుకంపు.. ఏళ్ల తరబడి ఓబనపల్లి, లెనిన్‌నగర్, మంగ సముద్రం, సంతపేట వాసులకు తీరని సమస్యగా మారింది. జనావాసాల మధ్య ఉన్న 15 వందల ఎకరాల్లోని మున్సిపల్ డంపింగ్ యార్డును మార్చాలంటూ ఈ ప్రాంత వాసులు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఎన్నిక లొచ్చిన సందర్భాల్లో 'మా పార్టీని గెలిపించండి డపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తాం..' అంటూ హామీలు ఇచ్చే నాయకులు తరువాత ఈ సమస్యను పట్టించుకోవడం లేదని విమర్శలు న్నాయి. రోజువారీ కార్మికులు, కూలీలు, ఆటో, భవన నిర్మాణ కార్మికులు అత్యధికంగా ఉన్న లెనిన్‌నగర్, మంగసముద్రం హోసింగ్ కాలనీ వాసులు డపింగ్ యార్డు కంపులోనే జీవనం సాగించాల్సి వస్తోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డంపింగ్ యార్డు పరిశీలన సందర్భంగా యార్డు లోని చెత్తను శుభ్రం చేస్తే సరిపోదు.. ఈ యార్డు లోని చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు యార్డును జనావాసాలకు దూరంగా మార్పు చేయని మంగసముద్రం డంపింగ్ యార్డు సమీపంలోని ప్రాంతాల్లోని ప్రజలు కోరుతున్నారు.


సమస్యగా మారిన డంపింగ్ యార్డు

చిత్తూరు మున్సిపాల్టీగా ఉన్న కాలంలో నాటి జనాభాకు తగ్గట్టుగా 15 వందల ఎకరాల్లో మంగసముద్రం వద్ద డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. క్రమంగా జనాభా పెరిగింది. మున్సిపాలిటీ నగర పాలక సంస్థగా అభివృద్ధి చెందింది. మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న చిత్తూరు నగర పాలక సంస్థ 50 డివిజన్లుగా ఏర్పాటు అయ్యింది. మున్సిపల్ లెక్కల ప్రకారం రోజుకు 5 నుంచి 6 టన్నులకు పైగా నగరంలో వ్యర్థాలు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. వర్షా కాలంలో డంపింగ్ యార్డులోని వ్యర్థాల కంపును ఈ పరిసర ప్రాంతాల్లోని ప్రజలు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఎండకాలంలో డంపింగ్ యార్డులోని చెత్త నిప్పంటుకొని దట్టమైన పొగలతో ఈ పరిసర ప్రాంతవాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. డంపింగ్ యార్డులు మార్చాలంటూ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నారు. గతంలో డంపింగ్ యార్డు మార్చేందుకు నగర పాలక సంస్థ అధికారులు తీవ్రప్రయత్నాలు చేశారు. మూడోగేటు బండపల్లివద్ద 10 ఎకరాల స్థలం కూడా సేకరించారు. అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో డంపింగ్ యార్డు మార్పు విరమించుకోవాల్సి వచ్చింది.

శుభ్రత సరి మార్పు ఎప్పటికీ?

డంపింగ్ యార్డును జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంఎల్‌ఏ గురజల జగన్మోహన్, నగర మేయర్, కమిషనర్ మొన్నటి గురువారం పరిశీలించారు. యార్డు సరిసర ప్రాంతాల్లోని ప్రజలు డంపింగ్‌యార్డు మారుస్తారని ఆశించారు. డంపింగ్‌యార్డు మార్పుపై ఎలాంటి హామీ ఇవ్వకనే శుభ్రం చేస్తాం.. ఇబ్బంది లేకుండా చూస్తాం..' అని మంత్రి చెప్పడంతో డంపింగ్ యార్డు సమీప ప్రాంతాల్లోని ప్రజలు నిరాశకు గురవుతున్నారు. జనా వాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డు వల్ల పిల్లలు, వృద్ధులు ఉదరకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారని డంపింగ్ యార్డులో మంటలు చెలరేగి దట్టమైన పొగలు అలుముకున్న సందర్భాల్లో ఇళ్లను ఖాళీ చేయాల్సి వస్తోందంటున్నారు. వర్షాకాలంలో ఈ ప్రాంతలో కంపు భరించలేక పోతున్నామని, జబ్బుల బారిన పడుతున్నట్లు చెబుతున్నారు. మున్సిపల్ నింధనల మేరకు జనావాసాల మధ్య ఉన్న డంపింగ్ యార్డును జనా వాసాలకు దూరంగా మార్చాలని డంపింగ్ యార్డు సమీప ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. 'శుభ్రత సరే డంపింగ్ యార్డు మార్చకుంటే ఎలా?'అని ప్రశ్నిస్తున్నారు.

పనిచేయని యాప్‌లు..

- అంగన్‌వాడీ కేంద్రాల వద్ద గంటలు తరబడి నిరీక్షణ
- సరుకులు మాకొద్దని లబ్ధిదారుల అసహనం
- అయోమయంలో అంగన్‌వాడీ కేంద్ర సిబ్బంది

ప్రజాశక్తి- పూతలపట్టు: అంగన్‌వాడీ కేంద్రాలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోకుండా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ ఆధారిత గుర్తింపునకు కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. అయితే లబ్ధిదారులకు సరుకులు, పోషకాహారం, తదితరాలు పంపిణీ చేసే సమయంలో యాప్‌లు పని చేయక పోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద లబ్ధిదారులు ముఖ ఆధారిత గుర్తింపునకు గంటలు తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది యాప్‌లు పనిచేయక పోవడంతో ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుని కూర్చుంటున్నారు. గంటలు తరబడి కూర్చునే సమయం లేక విసిగిపోతున్న లబ్ధిదారులు సైతం తమకు ఇచ్చేవి ఏవీ వద్దని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట ?

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలకు చెక్ పెట్టి పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోషకాహారం, సరుకులు పక్కదారి పట్టకుండా కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ ఆధారిత గుర్తింపునకు సంబంధించి ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇకపై పోషకాహారం, బాల సంజీవిని కిట్ల పంపిణీ సమయంలో లబ్ధిదారుల ముఖ గుర్తింపు తీసుకొని పంపిణీ చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంతోపాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో సరుకులు పక్కదారి పడుతున్న విషయాన్ని గమనించిన కూటమి ప్రభుత్వం పోషకాహారం లబ్ధిదారులకు పక్కాగా అందేలా కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నారులు, గర్భిణులు బాలింతలు కేంద్రాలకు వెళ్లి ప్రోత్సహించడంతోపాటు పోషకాహారం పక్కదారి పట్టకుండా ఇటీవల బాల సంజీవిని యాప్ 2.0 తీసుకొచ్చింది. రోజూ ఉదయం సాయంత్రం ఒక హాజరు తప్పనిసరి చేసింది. ఎంతమంది కేంద్రాలకు వచ్చారు? చరవాణి ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి పోషణ ట్రాక్ పేరుతో మరో ముఖ ఆధారిత యాప్ అమల్లోకి తీసుకు వచ్చింది. ఇకపై అంగన్‌వాడీ కార్యకర్తలు బాల సంజీవిని యాప్ పోషణ ట్రాకర్ రెండింటిలోనూ వివరాలు నమోదు చేసి ఈ కేవైసీ ముఖ ఆధారిత హాజరు నమోదు చేస్తున్నారు. దీంతో పోషకాహారం ఎంత మేరకు పంపిణీ అయ్యిందో పర్యవేక్షణ సులభ తరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

పనిచేయని యాప్‌లు

ఈ కేంద్రాలకు వెళ్లే గర్భిణులు, బాలింతలు యాప్‌లు పనిచేయక పోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో నిరీక్షణతో విసిగిపోతున్న లబ్ధిదారులు 'ఈ పౌష్టికాహారం మాకు వద్దు..!' అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అయోమయంలో అంగన్‌వాడీ సిబ్బంది


ముఖ ఆధారిత గుర్తింపు కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

ముఖ ఆధారిత యాప్‌లు ప్రస్తుతం పూర్తిగా పనిచేయడం లేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది తలలు పట్టుకోవాల్సిన అయోమయ పరిస్థితి నెలకొంది.



జగన్ పర్యటనపై ఎంపీ మిథున్‌రెడ్డితో చర్చిస్తున్న వైసిపి నాయకులు

జగన్ పర్యటన విజయవంతం చేయాలి


ఎంపీ మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి- పూతలపట్టు: ఈనెల 9వ తేదీ చిత్తూరు జిల్లాలోని బంగారుపాళ్యం మండలంలో మామిడి రైతుల కష్టాలను తెలుసు కోవడానికి వస్తున్న ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లాలోని నాయకులు ముందుకు రావాలని రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర మేధావుల ఫోరం కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఎం బండపల్లి ఎంపీటీసీ యతీష్, మరి కొంతమంది నాయకులు ఆయనను ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై చర్చించినట్లు నాయకులు వివరించారు.

నేడు మాజీ ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మాజీ ఎమ్మెల్యే వెంకటే గౌడ శనివారం మండలంలో పర్యటిస్తారని వైసిపి కన్వీనర్ బాగారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో వైసిపి మండల నాయకులు ఈ కార్యక్రమంపై నిర్వహణ ఏర్పాట్లను శుక్రవారం వారు చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ మోసం.. గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు, మండల నాయకులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసిపి కార్యకర్తలు అభిమానులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం



ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో ఎస్సీ విద్యార్థులు 13 మంది, ఎస్టీ 1, బీసీ ఐదుగురు, ఇతరులు ఇద్దరు విద్యార్థులు చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో బీసీ విద్యార్థులకు 29 మంది, ఎస్సీ 9, ఎస్టీ ముగ్గురు, ఓసీ నల్గురు, ఇతరులు ఐదుగురు విద్యార్థులు చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రెండు హాస్టళ్లలో ఆరో తరగతి నుండి పదో తరగతి విద్యార్థులను ఎస్సీ హాస్టల్ వార్డెన్ మురళి, బీసీ హాస్టల్ వార్డెన్ జై కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఆసక్తి కలిగిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు వెంటనే తమ వసతి గృహంలో చేర్పించాలని, ఈనెల 30 తేదీ లోపు విద్యార్థులు చేర్పించేలా చూడాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ వినియోగించుకోవాలన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: తడి, పొడి చెత్త సేకరణ పై శుక్రవారం ఉదయం మండలంలోని కోగిలేరు గ్రామపంచాయతీ బసవరాజుకండ్రిగలో ఎంపీడీవో బాలాజీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రభుత్వం వారు పంపిణీ చేసిన బుట్టల్లో తడి చెత్త పొడి చెత్త వేరువేరుగా చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. తద్వారా ఇంటితోపాటు గ్రామం కూడా పరిశుభ్రంగా ఉంటుందన్నారు. అదుబాటు మలవిసర్జన చేయరాదని ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కరసనపల్లి గ్రామంలో శనివారం నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే ఎన్.అమర్నాథరెడ్డి పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని మండల టిడిపి నాయకులు ఒక ప్రకటనలో కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న వివిధ రకాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక టు డిపో ఎదుట ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మధు, హరి ,ఎం ఎంఎగిరెడ్డి, మురుగేషన్, చిట్టెమ్మ, రేవతి మాట్లాడుతూ ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక కార్మికుల సమస్యలు మరింతగా పెరిగాయన్నారు. నాలుగు డిపి బకాయలను వెంటనే చెల్లించడంతోపాటు నూతనంగా ప్రవేశపెడుతున్న ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. కార్మికుల వేధింపులను మానుకోవాలని సూచించారు. గతంలో పోరాడి సాధించుకున్న సర్క్యులర్ 1-219 యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీఎస్ఆర్టీసీలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై రెండు రోజులపాటు అన్ని డిపోల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జిపి స్వామి, లోకేష్, వెంకటేశ్వర్లతో పాటు పలువురు ఏపీ ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలకు లేదు ష్యూరిటీ.. మోసాలే గ్యారెంటీ..

-మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ప్రజాశక్తి -కార్వేటినగరం: అధికార దాహంతో కనబడిన వారందరితో చేతులు కలిపి, అధికారం చేతికి వచ్చాక ఇచ్చిన మాట మర్చిపోయిన మొనగాళ్లు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కొల్లాగుంట చెక్‌పోస్టు సమీపంలోని వెట్రివేల్ కళ్యాణ మండపంలో నియోజకవర్గం సమన్వయ కర్త కృపాలక్ష్మి, ఎంపీపీ లతా బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రీకాలింగ్ చంద్రబాబుస్ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలు, వెన్నుపోటులు వంటివి బాబుకు వెన్నెతో పెట్టిన విద్య అన్నారు. నెల రోజులకు పైగా మామిడి రైతులు గిట్టుబాటు ధరలేక, పండించిన పంటను తరలించ లేక తల్లిడిల్లి పోతుంటే ఏమి ఎరగనట్లు బాబు మొహం వెల్లబెట్టడం దారుణంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తూ ఈ హామీలు అమలు కాకపోవడంతో ఎంత మేర నష్ట పోయారో వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కుల,మత వర్గా విభేదాలు లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అధికార దాహంతో అమలుకు నోచుకోలేని సూపర్ సిక్స్ హామీల పేరిట ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ప్రతి ఇంటికీ బాండ్లు పంచా రని, అధికారంలోకి వచ్చాక హామీలను ఎందులు ఆమలు చేయలేక పోతున్నారో చెప్పాలని వైసిపి నియోజక వర్గ సమన్వయ కర్త కృపాలక్ష్మి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లతా బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్ రాజు, కార్వేటి నగరం సర్పంచ్ ధనంజయ వర్మ, మండల కో ఆప్షన్ నెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, ఇవి చందు రాజు, మండల మహిళా అధ్యక్షురాలు మోహనకుమారి, ఆకుల గోపి, లోకనాథం నాయుడు, మునికృష్ణ, శ్రీనివాసులు రెడ్డి, పురంధర్, తౌకిర్ ఖాన్, ధనశేఖర్ వర్మ, పలువురు పాల్గొన్నారు.



క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నారాయణస్వామి



బదిలీ ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రొంపిచర్ల: రొంపిచర్ల మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో గత కొన్ని సంవత్స రాలుగా విద్యార్థుల అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేసిన ఉపాధ్యాయులకు విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన చిత్తూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎన్ ఇందిర మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు వాసాల ప్రకాష్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ ఇబ్రహీం మాట్లాడుతూ పదవ తరగతిలో పాఠశాల ప్రథమ స్థానంలో మార్కులు సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయలు ఇస్తానని ప్రకటించారు. మండల విద్యాశాఖాధికారి డి శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు గురించి విపులంగా వివరించారు. ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు సుజాత మాట్లాడుతూ వాసాల ప్రకాష్, ఉపాధ్యాయులు చాలా చక్కగా విద్యను అభ్యసించి, విద్యార్థులను ప్రగతి పథంలో నడిపారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నసీమా, ఆసిఫా, ఫయాజ్, శైలజ, రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాతాలు ఎన్‌పిసిఐతో అనుసంధానం చేసుకోవాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : తల్లికి వందనం పథకం ద్వారా స్కాలర్ షిప్ మంజూరు కోసం 1వ తరగతి నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు తమ తల్లి బ్యాంకు ఖాతాను, ఇంటర్మీడియట్ విద్యార్థులు వారి ఖాతాకు ఎన్‌పిసిఐ అనుసంధానం చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి విక్రమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అభివృద్ధి ప్రణాళిక భవిష్యత్‌కు వరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు : నియోజకవర్గ అభివృద్ధి అంశంలో అధికారులు చేపట్టే అభివృద్ధి ప్రణాళిక భవిష్యత్ తరాలకు ఓ వరంగా నిలవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్- 2047లో భాగంగా నియోజకవర్గం అభివృద్ధి ప్రణాళిక సమావేశం పలమనేరు మున్సిపల్ సమావేశ హాలులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా అధికారులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలు అభివృద్ధి చెందాలనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. ఇందుకోసం స్థానికంగా ఉన్న వనరులను, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అధికారులు అభివృద్ధి ప్రణాళికలు గ్రామస్థాయి నుంచి రూపొం దించాలన్నారు. ప్రధానంగా పలమనేరు ప్రాంతం వ్యవసాయంతో ముడిపడిన ప్రాంతమని ఇక్కడి అనుకూలతలకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలన్నారు. పీ-4 విధానం మేరకు గ్రామాల సమగ్ర సమాచారం సేకరించి బంగారు కుటుంబాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. అన్ని రంగాల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఎ పీడి శ్రీదేవి, ఆర్డీవో భవాని, మున్సిపల్ కమిషనర్ ఎన్వి రమణ రెడ్డి, తహశీల్దారు లు ఇన్బనాథన్, హనుమంతు నాయక్, ప్రసన్న కుమార్, ఎంపిడివోలు బాలాజీ, భాస్కర్, సురేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పైపులైన్లకు మరమ్మతులు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం పేటూరు గ్రామంలో



రక్షిత మంచినీటి సరఫరా చేసే పైప్ లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా పోతుండడంతో గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి జగదీష్ కు తెలిపారు. స్పందించిన ఆయన శుక్రవారం లీకేజీ ప్రాంతాన్ని పరిశీలించి పగిలిపోయిన పైపులను తొలగించి కొత్త పైపులు బిగించి లీకేజీలు కాకుండా మరమ్మతులు చేశారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాగునీరు వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆయన సూచించారు. సమస్యలు ఏవైనా ఉంటే పంచాయతీ వారికి తెలిపితే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. తెలిపారు.

ఇంజినీరింగ్‌లో సాఫ్ట్ స్కిల్స్ కీలకం

అపోలో యూనిర్సిటీ వీసీ డాక్టర్ హెచ్‌వినోద్ భట్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మానవ సంబంధ నైపుణ్యాలు కూడా మెరుగు పరచుకోవాలని అపోలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్‌వినోద్ భట్ అన్నారు. చిత్తూరులోని ది అపోలో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి నాలెడ్జ్ సెంటర్‌లో ఇంజినీరింగ్ విజయం కోసం... మృదువైన నైపుణ్యాలే కీలకం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్ వినోద్ భట్ నేటి యాంత్రిక యుగంలో సాఫ్ట్ స్కిల్స్ ప్రాధాన్యతను వివరించారు. ఇంజినీరింగ్ అంటే కేవలం కోడ్‌లు, సర్క్యూట్లు, యంత్రాలే కాదుని, సంబంధాలు, సంభాషణలు, సహకారమూ అంతే ముఖ్యమన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సాఫ్ట్ స్కిల్స్ పెంచుకోగలిగిన వారే అత్యున్నత స్థాయికి ఎదుగుతా రన్నారు. రిసోర్స్ పర్సన్‌గా పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎస్‌వి రమేష్ కుమార్ పాల్గొని, తన అనుభ వాలను విద్యార్థులతో పంచుకున్నారు. విద్యా రంగంలో మానవీయ విలువల ప్రాధాన్యం, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాజెక్ట్ ప్రెజెంటేషన్ వంటి అంశాలపై స్పష్టమైన దృక్కోణాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ డి జగదీశన్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. ఫిరోజ్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

ప్రజలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి: సీఎం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సమాజంలో అట డుగున ఉన్నవారిని అభివృద్ధి చేయడానికి మార్గదర్శులు ముందుకు రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 అమలపై శుక్రవారం సాయంత్రం అమరావతి నుండి వీడియో సమావేశం నిర్వహించారు. ఈ వీడియో సమావేశానికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చిత్తూరు నగరపాలక సంస్థ నుంచి హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంపై అధికారులు పక్కాగా యాక్షన్ ప్లాన్ రెడీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ నాయుడు, కమిషనర్ పి నరసింహ ప్రసాద్, సహాయ కమిషనర్ ఎ ప్రసాద్, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సమిత్ కుమార్ తెలిపారు. శుక్రవారం టాటా ఏఐజి ఇన్సూరెన్స్ కర్నూలు, చిత్తూరు జిల్లాల క్లస్టర్ మేనేజర్ సాగర్ జిల్లా కలెక్టర్ ను కలిసి పంటల బీమా పథకం ఖరీఫ్ 2025 ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం క్లస్టర్ మేనేజర్ సాగర్ మీడియాతో మాట్లాడుతూ తుపాను, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేసి బీమా పరిహారం చెల్లిస్తారన్నారు. ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న రైతులకు ఈ పథకంలో చేరడానికి అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి రెండు శాతం, వాణిజ్య పంటలకు ఐదు శాతం, వార్షిక ప్రీమియం రైతు చెల్లించిన మిగిలిన మొత్తాన్ని బీమా కంపెనీలకు రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. చిత్తూరు జిల్లాలో వరి42 వేలు, రాగి కి 17 వేలు, కందులకు 20వేలు ఒక ఎకరానికి బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. వరి కి 840 రూపాయలు 2020 ఆగస్టు 15 లోపు, రాగులు 170 , కందులు 400 రూపాయలు జూలై 31 లోపు చెల్లించాలన్నారు. బ్యాంకుల ద్వారా పంట రుణం తీసుకున్న రైతులకు రుణం పొందిన సందర్భంలో చెల్లిస్తారన్నారు. రుణం తీసుకోని వారు పోస్ట్ ఆఫీస్, మీసేవ, సి ఎస్ ఎస్ సెంటర్, సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, వారి వద్ద సంబంధిత పత్రాలను అందించి ఆన్లైన్ ద్వారా పంట బీమా నమోదు చేసుకోవచ్చున్నారు. ఇతర వివరాలకు రైతు సేవ కేంద్రాలు మండల వ్యవసాయ అధికారులు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఇతర వివరాలకు క్లస్టర్ మేనేజర్ సాగర్ ను 9059634144 నెంబర్ ను సంప్రదించలన్నారు. ఈ కార్యక్రమంలో టి ధనంజయ, డివిజనల్ కోఆర్డినేటర్ టి పెద్దన్న పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: కటారి హేమలత

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : సమిష్టిగా టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి అని పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో 23 పంచాయితీల కార్యకర్తలతో నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుడ ఛైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ 23 పంచాయితీల్లో కార్యకర్తలు, నాయకుల సమన్వయంతోనే గ్రామ కమిటీ అధ్యక్షులను, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారని వీరందరూ సమిష్టిగా పార్టీ బలోపేతానికి కలిసిమెలిసి కృషి చేయాలని వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రాజశేఖర్ నాయుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి కుమార్ నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య , కే యం రవి, బాలాజీ నాయుడు మాజీ ఎంపీటీసీ వేమన నాయుడు, బాబు నాయుడు, పైనేనీ మురళి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మామిడి రైతులకు భరోసాపై మంత్రి హర్షం

ప్రజాశక్తి -చిత్తూరు (యాదమరి): రైతే దేశానికి వెన్నెముక , రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని సీఎం చంద్రబాబు ఎప్పుడూ నమ్ముతారని ఆ మార్గదర్శకత్వంలోనే మామిడి రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం స్పందించిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరితో, నష్టాల్లో ముంచిన వైసీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని గుర్తు చేస్తూ, ఈసారి ప్రభుత్వం ఒక్కొక్క రైతు పట్ల నిబద్ధతతో వ్యవహరిస్తుందని మంత్రి తెలిపారు. వ్యాపార దళారుల ఒత్తిళ్లను లెక్కచేయకుండా, రైతుల ధాన్యానికి, పంటలకు, ఇప్పుడు మామిడి పంటకు అండగా నిలబడిన చంద్రబాబును మంత్రి కొనియాడారు. ఈ సంవత్సరం తోతాపురి మామిడి ఉత్పత్తి భారీగా ఉండటంతో ధరలు క్షీణించాయని, దీని వల్ల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇటువంటి సంక్షోభ సమయంలో ముఖ్యమంత్రి నిర్ణయంతో ప్రభుత్వం కిలో మామిడికి రూ.4 సబ్సిడీ అందిస్తూ, రూ.12కి ప్రభుత్వ కొనుగోళ్లను ప్రారంభించిందన్నారు.

'కొత్త ఫైబర్ నెట్ ప్లాన్స్'ను సద్వినియోగం చేసుకోవాలి: బిఎస్ఎన్ఎల్

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: భారత్ (బిఎస్ఎన్ఎల్) కొత్త గా ఫైబర్ నెట్ ప్లాన్స్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ డైరెక్ట్ సెల్లింగ్ ఏజెంట్ జీవరత్నం పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పాతపాళ్యం పంచాయతీలోని మిట్ట కొత్తూరు లో బిఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ సేవలపై కరపత్రాలను చిత్తూరు సెల్ టాన్ మొబైల్స్ షాపు యాజమాని కృష్ణమనాయుడు, జిల్లా టిడిపి యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, మాజీ సింగిల్ విండో మాజీ వైస్ ఛైర్మన్ బాబునాయుడు, నేతలు వెంకటేశులు నాయుడు, వెంకటేష్ యాదవ్‌లకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవరత్నం మాట్లాడుతూ చిత్తూరు ఆ శాఖ డిఈ సురేంద్రనాథ్, ఎస్ డి ఓటి కట్టా శ్రీనివాస్ ఆదేశాల మేరకు బిఎస్ఎన్ఎల్ కొత్త ఫైబర్ నెట్ సేవలు గురించి గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రం పంచి విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.



మొబైల్స్ షాపు యాజమాని కృష్ణమనాయుడు తో కలిసి కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

క్రైం న్యూస్

గుడిలో చోరీ

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పలమనేరు టు కుప్పం జాతీయ రహదారి బైరెడ్డిపల్లి తూర్పు మొగసాల బాట గంగమ్మ దేవస్థానంలో గురువారం రాత్రి దొంగలు పడి 2 లక్షల రూపాయలు విలువైన నగలు అపహరించారని ఆలయన అర్చకుడు, ఆ గ్రామస్తులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గురువారం బాట గంగమ్మ గుడిలో చోరీకి పాల్పడ్డారని, శుక్రవారం ఉదయం యథావిధిగా గంగమ్మ గుడికి వెళ్లగా బయట తాళం విరిచేశారని గుర్తించి సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలిపామన్నారు. వారు అక్కడికి చేరుకొని పురోహితుడు జై చంద్రబాబు చెప్పిన కథనం మేరకు గుడి లోపల పరిశీలించగా అమ్మవారి అలంకరించిన 22 గ్రాములు బంగారు, తాళిబొట్టు దొంగలించారని అమ్మ గుడి ముందు వున్న హుండీ తాకలేదని బంగారు ఆభరణాలు మాత్రమే పోయాయని వారు గుర్తించారన్నారు. ఈ మేరకు అర్చకుడు జై చంద్రబాబు , బైరెడ్డిపల్లి గ్రామస్తులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని తలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మనస్థాపనతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన శుక్రవారం మండలంలోని మహాసముద్రం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. యాదమరి మండలం మోర్దాన పల్లి పంచాయతీ సి ఆర్ కండికి చెందిన మునిరత్నం కుమారుడు దామోదరం (49)కోళ్ల వ్యాన్ కు డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఎవరో అన్న మాటలకు తీవ్ర మనస్థాపం చెంది శుక్రవారం మహాసముద్రం వద్ద వాహనాన్ని పక్క ఆపి వాహనంలోని కొక్కికే ఉరివేసుకుని మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనలు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

36 మందికి జరిమానా

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఒకటవ పట్టణ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర డ్రంక్ అండ్ డ్రైవ్ , ఓపెన్ డ్రింకింగ్‌పై శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 36 మంది వ్యక్తులు పట్టుబడ్డారు. వారిని రెండవ తరగతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఇందులో డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన ఆరుగురికి రూ.60,000 జరిమానా, బహిరంగంగా మద్యం తాగిన 30 మందికి రూ.30,000 జరిమానా విధించారు. మొత్తం రూ.90,000 జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఒకటవ పట్టణ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడతాయన్నారు. ఇలాంటి వారిపై తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- పలమనేరు: యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో రాణించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పలమనేరు వర్ర చెన్నారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడప్ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో పలమనేరు అన్ని రంగాలలో అభివృద్ధి చెందే ప్రాంతమని, ఇక్కడి వాతావరణం రాష్ట్రంలో ఎక్కడ లేని కారణంగా మంచి పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. యువత టెక్నికల్ ఎడ్యుకేషన్ పై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. గారు తెలిపారు. ఈ జాబ్ మేళాలో 20 బహుళ జాతీయ కంపెనీలు వారు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 489 మంది హాజరుగాగా వారిలో 178 ఉద్యోగ అవకాశాలు పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యం. గుణశేఖర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

మామిడి రైతులకు సబ్సిడీ : ఎంఏవో

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మామిడి రకం పండించిన రైతులకు ప్రభుత్వం కేజీకి నాలుగు రూపాయలు వంతున సబ్సిడీ ఇస్తున్నట్లు ఎంఏవో తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వీఆర్వో, అగ్రికల్చర్ సిబ్బందితో మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి, హార్టికల్చర్ అధికారి మౌనిక శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఏవో మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల ప్రభుత్వం మామిడి పంట రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. తోతాపురి మామిడి రకం పండించిన రైతులు వారి భూమి పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్సును తీసుకువచ్చి వీఆర్వోలను, అగ్రికల్చర్ సిబ్బందితో సంప్రదించి పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తోతాపూరి మామిడికాయ పంట చేసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో గీతా కుమారి . అగ్రికల్చర్ సిబ్బంది వీఆర్వోలు పాల్గొన్నారు.

రెచ్చగొట్టేందుకే వైసిపి పర్యటనలు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : 2019-24 మధ్య అధికారంలో ఉన్న వెసిపి ప్రభుత్వం మామిడి రైతులకు ఎప్పుడైనా రాయితీ ఇచ్చిందా?' అని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రశ్నించారు. శుక్రవారం చిత్తూరు నగరపాలక కార్యాలయంలో మేయర్ ఎస్ అముద, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ మామిడి రైతులపై దొంగ ప్రేమతో వైసిపి అధినేత చిత్తూరు పర్యటనకు వస్తున్నారని అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వైసిపి ప్రభుత్వం, నాయకులు ప్రస్తుతం మామిడి రైతులపై రాజకీయం చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే విమర్శించారు. జిల్లాలో ఏటా 2.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి జరుగుతుందని.. కానీ ఈ సంవత్సరం ఏకంగా 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరగడం, ఇదే సమయంలో పశ్చిమ ఆసియాలో నెలకున్న యుద్ధ పరిస్థితుల కారణంగా పల్ప్ ఎగుమతులపై గణనీయ ప్రభా వం చూ పింద న్నారు. ఈ పరిస్థితుల్లో మామిడి రైతులను ఆదుకోవాలని ఉద్దేశంతో.. ఫ్యాక్టరీలో కిలో రూ.8 కచ్చితం గా ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ.4 రాయితీగా ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీన్ని మరిచి మామిడి రైతులను పరామర్శించే నెపంతో వైసిపి రాజకీయ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, టిడిపి కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థుల అభివృద్ధి

ప్రజాశక్తి - యాదమరి: ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకుని అభివృద్ధి చెందుతారని షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీ ప్రెసిడెంట్ ఎల్ జోసెఫ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కే గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సుమారు 60వేల రూపాయల విలువైన విద్యా సామగ్రిని అందించారు. పేద విద్యార్థులు విద్యలో వెనుక పడకూడదని వారిని అన్ని విధాల ప్రోత్సహించేం దుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థునులకు యూనిఫాం, స్టడిమెటిరియల్స్, బ్యాగ్స్, పెన్స్, పెన్సిల్, బాక్స్, ప్రాథమిక విద్యార్థిని, విద్యార్తులకు వితరణగా ఇవ్వడం ఎంతో సంతోషించదగ్గ విషయమని ప్రిన్సిపాల్ ఎపి లలిత అభినందించారు. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు గత మూడు సంవత్స రా లు రెండు లక్షలు, విలువ కలిగిని విద్యా సామగ్రి, ల్యాబ్ మెటిరియల్స్ ,కె.గొల్ల పల్లె హైస్కూల్ ప్లస్ కి ఇచ్చి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న జువాలజీ అధ్యాపకులు సి మహేష్‌ను అభినందించారు. జోషఫ్ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ నవీన్ అధ్యాపకులు, దామోదర్ రెడ్డి, మధుసూదన్, సుధాకర్, భాస్కర్ రెడ్డి, కనకాచారి, మదన్ మోహన్, రాజరాజేశ్వరి, అరుణ, భారతి, రమాదేవి, షణుగ్మం, మంజుల , చిట్టిబాబు, చిన్నదొరై విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యా సామగ్రి పంపిణీ చేసిన షేర్ జీసెస్ వర్డ్ మనిస్ట్రీ ప్రెసిడెంట్

ఇంటింటికీ ప్రచారం

ప్రజాశక్తి - రొంపిచర్ల : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో 'తొలి అడుగు - ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని పుంగనూ రు నియోజకవర్గం రొంపిచర్ల మండలం బొమ్మయ్యగారిపల్లి గ్రామ పంచాయతీ నగిరి హరిజనవాడ లో టిడిపి ఇన్‌చార్జి చల్లా రామచంద్రా రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళ లతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని అప్పటికప్పుడు సంబంధిత అధికారులను పిలిపించి పరిష్కరించారు. ఈ కార్యక్రమం లో మండల టిడిపి అధ్యక్షుడు ఉయ్యాల రమణ, ఎంపీటీసీ సహదేవ, రొంపిచర్ల సర్పంచ్ ఆర్ ఇబ్రహీం ఖాన్, సింగిల్ విండో ఛైర్మన్ రఘునాథరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, సురేంద్ర, ప్రభుత్వ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలకు అభివృద్ధిని వివరిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి

చిత్తూరు అర్బన్ : మూడవ రోజు శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులతో కలిసి చిత్తూరు నగర పాలక సంస్థలో 7, 8, 9, 10 వార్డు పరిధిలో కొంగారెడ్డిపల్లి మెయిన్ స్ట్రీట్, కుమార్ నగర్ కాలనీ, గాంధీనగర్ గాంధీ, ఎన్.బి.కాలనీలో ఇంటింటికి వెళ్లి కూటమి ఏడాది పాలనలో సాధించిన విజయాలను, చేపట్టిన అభివద్ధి పనులను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యలు పరిష్కరించాలన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎస్ అముద, చుడా ఛైర్ పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, క్లస్టర్, డివిజన్ ఇన్‌చార్జులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబుతోనే పల్లెలు అభివృద్ధి చెందుతాయి అని జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు అన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం పాతపాళ్యం, అంబోదరపల్లి పంచాయతీలలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను టిడిపి నాయకులు అందించారు. సంక్షేమం అభివృద్ధి పై ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు స్వామి దాస్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ శ్రీధర్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, టిడిపి నాయకులు హరీష్ యాదవ్, వెంకటేష్ నాయుడు, కోదండ రెడ్డి, బాబు నాయుడు, జ్యోతి రెడ్డి , సుధాకర్ నాయుడు,రాంబాబు రెడ్డి, ప్రసాద్ నాయుడు, లోకేష్ నాయుడు, శాంతకుమార్, జీవరత్నం, జ్యోతి యాదవ్, రవి, గోపి, పాల్గొన్నారు.

పలమనేరు: ప్రజా శ్రేయస్సు కోసం పనిచేసే సంక్షేమ మంచి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి అన్నారు. పలమనేరు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్ర మంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సత్య గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరిస్తూ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్. వి.బాలాజీ, కుట్టి, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, ఖాజా, బీఆర్సి కుమార్,కిరణ్, రూపేష్, సుదర్శన్ బాలాజీ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం : ఎస్ఆర్ పురం టిడిపి మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ మండలంలోని డీకే మర్రిపల్లి గ్రామపంచాయతీ లో శుక్రవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గంధమనేని రాజశేఖర్ నాయుడు, నరేష్, వెంకటరమణ పాల్గొన్నారు.